క్లుప్తంగా

నేడు పులిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

గురజాల : మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), గుంటూరు ఉమ్మడి జిల్లా రైల్వే బోర్డు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు పాల్గొంటారని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
గురజాల : న్యాయవాదులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను అధ్యక్షుడు షేక్ జానీబాషా బుధవారం అందించారు. బార్ అసోసియేషన్ నందు న్యాయవాదులు చెల్లించిన హెల్త్ ఇన్సూరెన్సు ప్రీమియం ద్వారా ఈ కార్డులను రక్ష హెల్త్ ఇన్సూరెన్సు టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఈ హెల్త్ కార్డులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కాశీవిశ్వనాధం, సీహెచ్ రామిరెడ్డి, కె.ప్రభుదాసు, కె.వి.నాగార్జున, కె.హరిసత్యనారాయణ తదితరులున్నారు.

31 కొత్త పింఛన్లు మంజూరు

పిడుగురాళ్ల: పట్టణంలో మొత్తం 31 పింఛన్లు కొత్తగా మంజూరు అయినట్లు కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. వృద్ధాప్య పింఛన్లు 15, వికలాంగుల పింఛన్లు 10, విడో పెన్షన్లు 3, డప్పు కళాకారులకు 1, ఒంటరి మహిళ 1, ట్రెడిషన్ కాలర్ 1 మొత్తం 31 పింఛన్లకు గాను రూ. 87,750 నగదును అందజేయటం జరిగిందని ఆయన తెలియజేశారు.

అప్పుడు ఖరీదైనవి.. ఇప్పుడు పూర్తిగా ఉచితం

వినుకొండ(నూజెండ్ల): అరుదైన, ఖరీదైన మందులు ఇప్పుడు ప్రభుత్వం తరపున పూర్తిగా ఉచితంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన హార్ట్ స్ట్రోక్ వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఇచ్చే ఇంజక్షన్‌కు సంబంధించిన మందులను పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్ట్ స్ట్రోక్ వచ్చిన 10 నిమిషాల లోపు ఈ ఇంజక్షన్‌ను రోగికి చేయగలిగితే వారికి ప్రాణహాని ఉండదని, అలాంటి మెడిసిన్ ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.40 వేలు విలువ కలిగి ఉంటుందని, అలాంటిది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా పూర్తిగా ఉచితంగా పేద ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజాక్, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సామర్థ్యాలను మెరుగు పరచాలి

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్ని వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి వెనుకబాటులో ఉన్న వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నరసరావుపేట ఉపవిద్యాశాఖ అధికారి(డీవైఈవో) కె.వేణుగోపాలరావు పేర్కొన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని 9,10 తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్, వాటికి సంబంధించిన నోట్స్ తయారీ తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థులకు అవగతం అవుతున్నదా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఆంగ్లం, తెలుగు, హిందీ, గణితం పాఠ్యాంశాలల్లోని ప్రశ్నలకు విద్యార్థుల నుంచి జవాబుల్ని రాబట్టి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌పీ బోర్డులు, బైజూస్ ట్యాబ్‌లను ఎలా ఉపయోగిస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. వాటి ప్రయోజనాలు, ప్రభుత్వం అందుకు వెచ్చిస్తున్న వ్యయం గురించి విద్యార్థులకు వివరించారు. . అనంతరం మధ్యాహ్న భోజ న పథకాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ అన్నింటికీ మించి గ్రామస్తులు అందిస్తున్న సహకారం గురించి పాఠశాల హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి డీవైఈవోకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయులు, శైలజా, శ్రీనివాసరావు, రమాదేవి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలు పూర్తి చేయాలి

నాదెండ్ల: ఓటర్ల జాబితాలో సవరణలను గురువారం సాయంత్రంలోగా పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, వీఆర్వోలకు ఎలక్షన్ క్లెయిమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలతో పాటు పోలింగ్ బూతుల్లో మార్పుల కోసం వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన దర ఖాస్తులను గురువారంలోగా పరిష్కరించేందుకు పనిచేయాలన్నారు. రీసర్వే కూడా పూర్తయినందున తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉందన్నారు.

అన్ని వర్గాలను ఆదుకోవడమే సీఎం జగన్ ఆశయం

- సీఎం జగన్ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఆకర్షితులై..
- జెట్టిపాలెంలో 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



కంచరగుంట గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబీకులు వైఎస్సార్‌సీపీలోకి చేరిన సందర్భంగా కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిఆర్కే

రెంటచింతల: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద ప్రజల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన కిన్నెర ప్రకాష్‌రావు, దావులూరి పెద దానయ్య, డి.నాగేశ్వరరావు, ప్రసాదరావు, ఏసోబు, చంద్రశేఖర్ తదితర 10 కుటుంబాల వారు మాకు గతంలో ఏ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వలేదని సీఎం జగన్ అమ్మఒడి, వైఎస్సార్ చేయుత, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న తోడు, ఇళ్ల స్థలాలు తదితర సంక్షేమ పథకాలు అందచేశారని అందుకే టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు పేదలకు అందచేయడం వలన పేదలు ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉంటున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గత 4 సం. 4 నెలల కాలంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒక్క జెట్టిపాలెంలోనే కాకుండా అన్ని గ్రామాల్లో 2024 సార్వత్రిక ఎన్నికలలో భారీ మెజార్టీ తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సమష్టిగా కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు, ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజలను మోసం చేసి దోచుకున్న దానికి న్యాయస్థానంలో ఖచ్చితంగా శిక్ష తప్పదన్నారు. సీఎం జగన్‌పై అభాండాలు వేసి అధికారం కోసం ప్రతిపక్షాలు తహతహలాడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావులూరి రమేష్, మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు, పార్టీ నాయకులు పేరువాళ్ల కోటయ్య పాల్గొన్నారు.



జెట్టిపాలెం గ్రామస్తులకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్



బండి కుటుంబీకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పీఆర్కే

టీడీపీని వీడిన 15 ఎస్సీ కుటుంబాలు

దుర్గి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యతను కల్పిస్తూ అందిస్తున్న పథకాల పట్ల ఆకర్షితులై మండల పరిధిలోని కంచరగుంట గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీని వీడి బుధవారం పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతుగా మద్దతు తెలియజేయటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజా మద్దతుతో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా తోడ్పాటునందించిన నిజమైన సామాజిక వేత్త ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, దేవరకొండ పున్నారావు, వేముల వెంకటేశ్వర్లు, కోటా రాజు, మాదాసు హనుమంతు, సచివాలయం కన్వీనర్ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

జనసేనను వీడిన బండి కుటుంబీకులు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను కులాలకు, పార్టీలకు అతీతంగా అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వ పటిమకు నిదర్శనమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు కుటుంబీకులు పీఆర్కే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సరైన గుర్తింపు, గౌరవాన్ని కల్పిస్తామన్నారు. రాబోయే రోజులలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, ముటుకూరు సర్పంచ్ గొంది నాసరయ్య ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ భరోసా



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్లు పద్మావతి

పిడుగురాళ్ల: ప్రతి ఒక్కరికి భరోసా కల్పించటమే బాధ్యత వైఎస్సార్‌సీపీదేనని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయంలో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఇటీవల మృతి చెందిన జాఫర్ కుటుంబానికి వెంటనే పింఛన్ మంజూరు చేసి వారికి భరోసా కల్పించటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నెం పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు కుందుర్తి గురవాచారి, బత్తుల నాగిరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, అన్నెం బంగారురెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం ..

పిడుగురాళ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని 4వ సచివాలయంలో 6, 7 వార్డులలో కొత్తగా మంజూరు అయిన పింఛన్లను మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లూరి వెంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

- మత్స్యకారుల జీవనోసాధికి ప్రభుత్వం ఎంతో కృషి
- మత్స్య శాఖ జిల్లా అధికారి ఎస్.సంజీవరావు



కృష్ణానదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాచవరం: మత్స్యకారుల జీవనోసాధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని మత్స్య శాఖ జిల్లా అధికారి ఎస్.సంజీవరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం బల్లకట్టు రేవు వద్ద ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా కృష్ణానదిలో సుమారు 24 లక్షల 26 వేల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు, మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులకు పెన్షన్లు, హార్బర్ల ఏర్పాటు, ఆక్వాకల్చర్ ప్రోత్సాహం, మత్స్యకారులకు లైసెన్సులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో నాణ్యమైన చేప పిల్లలను కృష్ణానదిలో విడుదల చేయడం జరిగిందన్నారు. మత్స్య సంపదను పెంపొందించి, దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో ఉంచేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు ప్రాంతాల్లో చేప పిల్లలను విడుదల చేయడం జరిగేదని, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రోత్సాహంతో వెనుకబడిన ప్రాంతమైన మాచవరం మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట చేయరాదని, ఎవరైనా చేపడితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, మండల నాయకులు షైదా, బ్రహ్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివరామయ్య, వెంకటేశ్వర్లు, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



ఎస్‌ఐ జె.సామెల్ రాజీవ్ కుమార్

రెంటచింతల: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న గ్రామాల్లో ఏర్పాటుచేసే వినాయక విగ్రహాల పందిళ్లకు, మైకులకు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ జె.రాజీవ్ కుమార్ అన్నారు. బుధవారం రెంటచింతలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి కోసం ఇచ్చే దరఖాస్తుతో పాటు ఐదుగురు అంతకంటే ఎక్కువ మందితో కమిటీగా ఏర్పడి వారి వివరాలను ఖచ్చితంగా పోలీసులకు అందచేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించరాదన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా అర్జీదారుడు, కార్యనిర్వాహకులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. ఇతరులకు అభ్యంతరకరమైన, ఇబ్బందికరమైన మాటలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖాధికారుల నుంచి కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. వివాదస్పదమైన స్థలాలలో వేదికలు ఉండరాదన్నారు. ప్రభుత్వ స్థలమైతే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతులు తీసుకోనివారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్రశాలలో సాయంత్రం 5గం.లోపు మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంటుందని సీసీ కెమెరాలతో పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటుచేస్తున్నామన్నారు. విగ్రహం ఊరేగింపు సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విగ్రహాల కమిటీ సభ్యులు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

డప్పు చర్మ కళాకారులకు పింఛన్లు అందజేత

- ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదుగా
- నూతన పెన్షన్లతో వెల్లివిరిసిన ఆనందం



మాజీ సర్పంచ్‌కు నూతన పెన్షన్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరెడ్డి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వైఎస్సార్ పెన్షన్ కానుకను పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పలువురు డప్పు కళాకారులకు, చర్మ కార్మికులకు పంపిణీ చేశారు. మండల పరిధిలో సెకండ్ ఫేజ్‌లో 255 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నెహ్రూనగర్ తండా, కంచరగుంట గ్రామాలకు చెందిన డప్పు కళాకారులకు, చర్మకార్మికులకు ప్రభుత్వ విప్ పీఆర్కే అందజేశారు. పెన్షన్ రావటంతో కళాకారులు తమ డప్పులను వాయించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, ఎంపీడీఓ కె. సమతావాణి, సెక్రటరీ వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, సర్పంచ్ గొంది నాసరయ్య, మాదాసు వెంకటేశ్వర్లు, నెహ్రూనగర్ తండా సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయక్ పలువురు నాయకులున్నారు.

టీడీపీ మాజీ సర్పంచ్‌కు పింఛను మంజూరు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుకను పార్టీలకు, మతాలకు, కులాలకతీతంగా పంపిణీ చేస్తున్న దృశ్యం గ్రామాలలో కనిపిస్తుంది. తాజాగా బుధవారం మండల పరిధిలోని కోలగుట్ల గ్రామంలో టీడీపీ మాజీ సర్పంచ్ నల్లపాటి వెంకటేశ్వర్లు వృద్ధాప్య పెన్షను కోసం అర్జీ పెట్టుకోగా అధికారులు అన్ని పత్రాలు తనిఖీ చేసి నిర్ధారించుకొని మంజూరు చేసినట్లు సర్పంచ్ మద్దికర శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఘటనతో పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న అందరికీ పెన్షన్లు మంజూరు చేస్తున్నారని మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ సర్పంచ్ మమ్ము శ్రీనివాస్, ఎంపీటీసీ నక్కా ఆదినారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతలలో పింఛన్‌లు

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లు అందచేస్తున్నట్లు రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా పింఛన్ లబ్ధిదారులకు వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి పింఛన్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందచేసి వారికి అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యులు మోర్తల ఉమ, పార్టీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ ఉన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

మాచవరం: అక్రమంగా నిల్వ ఉంచిన 220 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని చెన్నాయపాలెం గ్రామానికి చెందిన సఫావత్ నరసింహా నాయక్ , మంగాభాయిలు అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, పశువుల పాకలో నిల్వ ఉంచిన 220 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.30,600 ఉంటుందన్నారు. మద్యం సీసాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ స్క్రీనింగ్ క్యాంప్



వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళా ప్రాంగణంలో కమిట్మెంట్ సంస్థ, ఎన్‌ఐఎల్‌డీ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థో లోపం, వినికిడి లోపం, చూపు లోపం ఉన్నవారికి ఉపకరణాలను అందజేసేందుకు బుధవారం స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, ఎంపీడీవో మంగాపుర్‌నాథ్‌లు మాట్లాడుతూ దివ్యాంగులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులకు త్వరలో పరికరాలను అందజేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రామాంజనేయులు, కమిట్మెంట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ఝాన్సీరాణి, పీఎం ఉదయ్ కిరణ్, కోఆర్డినేటర్స్, కార్యకర్తలు, ఎన్‌ఐఎల్‌డీ సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ సర్వీస్ ఆఫీసర్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.

అసోసియేషన్ గుర్తింపుపై కార్మికుల హర్షం

వినుకొండ(నూజెండ్ల) : ఏపీఎస్ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా గుర్తింపు ఉన్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తించి జీవో జారీ చేయడంపై వినుకొండ డిపో మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ వ్యవస్థాపకులు స్వర్గీయ పి.రామ్మోహన్‌రావు విగ్రహానికి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పాళ్ల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎంయూకు అతి పెద్ద యూనియన్‌గా ప్రభుత్వ గుర్తింపు లభించడం హర్షనీయమని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇది ఎంతగా నో దోహదపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

172వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం



అంబేద్కర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42 వ సచివాలయంలో 172 వ రోజు బుధవారం అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేసి జగన్‌మోహన్‌రెడ్డి ఆయా కుటుంబాలకు ఎంత ఆర్థిక ప్రయోజనం కలిగిందో వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే ప్రజలకు అందిస్తూ గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చి సీఎం జగన్ ఓ చరిత్ర సృష్టించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేస్తూ సీఎం జగన్ ప్రజాదరణ పొందుతుంటే ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలతో కుళ్ళు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు ఆర్థిక నేరాలలో అడ్డంగా దొరికి ఇంకా ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా తన ఎల్లో మీడియా ద్వారా విషప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ(డ్వాక్రా) వంటి వివిధ సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబాలకు లబ్ధిచేకూరిందని ఎప్పటికీ మేము జగనన్న రుణం తీర్చుకోలేమని కాలనీ వాసులు పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. పలు సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి ఎంతో ఆర్థిక భరోసా కల్పించిన సీఎం జగన్‌కు మేము ఎల్లవేళలా అండగా ఉంటామని అంబేద్కర్ కాలనీ వాసులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఆయన దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ ఎన్ని అబద్ధపు మాటలు చెప్పినా తమకు అనుకూలమైన పత్రికల్లో కుతంత్రాలతో కూడిన రాతలు రాయించిన 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా అధికారం చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్శిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్రీడల్లో దివ్యాంగుల ప్రతిభ



దివ్యాంగులకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎంఈవో వై. శ్రీనివాసరావు

గురజాల : పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని ఎంఈవో సాంబశివరావు సూచించారు. స్థానిక భవిత కేంద్రం విద్యార్థులను బుధవారం అభినందించారు. నరసరావుపేటలో దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గురజాలకు చెందిన భవిత కేంద్రం విద్యార్థులు 5 బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ ఉన్నా విజయం సాధించలేరని మీరు పోటీతత్వంతో పోటీల్లో పాల్గొని విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. ఎంతో మంది దివ్యాంగులు ఎన్నో పతకాలు సాధించారని గుర్తుచేశారు. అనంతరం క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి వారికి షీల్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏ విజయలక్ష్మీ, ఝాన్సీరాణీ తదితరులున్నారు.

పిడుగురాళ్ల దివ్యాంగుల ప్రతిభ

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటలో పోటీలు నర్సరావుపేటోని జెడ్పీ హైస్కూల్ శంకరభారతి పాఠశాలలో నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన భవిత వికలాంగుల పాఠశాలలోని దివ్యాంగులు ప్రతిభ కనబరిచారు. షార్టుపుట్, రన్నింగ్, స్లోవాక్, బుస్సీగేమ్ నందు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలలో గెలుపొంది విజేతలుగా నిలిచారు. వీరికి పిడుగురాళ్ల పట్టణంలోని దివ్యాంగుల పాఠశాలలో ఎంఈవో వై. శ్రీనివాసరావు చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసమే ఈ ఆటల పోటీలు నిర్వహించటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కె. హరికుమార్, ఎం.అజయ్‌కుమార్ ఎల్. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

సత్తెనపల్లి: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి మరో వ్యక్తికి ప్రాణదాతలుగా మారాలని నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవరావు అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని గాస్పల్ మిషన్ చర్చిలో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్ర గుంటూరు అనుబంధ సంస్థ, చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దార్ల సంధ్య సహకారంతో నేత్ర దానంపై అవగాహన, ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు.

కౌలు రైతులకు రూ.1.52కోట్ల పంటరుణాలు

నకరికల్లు: కౌలుదారు రైతులకు పంటరుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి బ్యాంకర్లను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి బ్యాంకర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా శాఖలవారీగా ప్రభుత్వ పథకాలకు బ్యాంకుల ద్వారా మంజూరైన నిధులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో బ్యాంకర్ల పాత్రపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 214మంది కౌలురైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ1.52కోట్ల పంటరుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

సత్తెనపల్లి: పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ పంట రుణాలు కల్పించాలని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్స్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి మండలంలో 2,700 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. సీసీఆర్సీ కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు పంట సాగుపై రుణాలు అందించాలన్నారు.